జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్గొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

సోమవారం 05 అక్టోబర్ 2026 పేజీలు:10




## సోమిరెడ్డికి సన్మానం



**ఆలేరు అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన దొంతిరి సోమిరెడ్డి ఇటీవల జరిగిన మదర్ డైరీ ఎన్నికలలో డైరెక్టర్ గా అఖండ విజయం సాధించగా ఆదివారం

వివరాలు 2లో



# కరెంటు కోతలపై రైతన్న కన్నెర్ర!

- కనీసం 12 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి
- రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగానికి నష్టం
- రావులపల్లి క్రాస్‌రోడ్డు తండా సబ్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు, రైతుల ధర్నా
- 12 గంటల కరెంటు ఇవ్వకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం



**తుంగతుర్తి, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):**

వానాకాలం సాగులో ఉన్న వరి పంటలను కాపాడేందుకు రైతులకు కనీసం 12 గంటలపాటు నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ తుంగతుర్తి నియోజకవర్గంలోని రావులపల్లి క్రాస్‌రోడ్డు తండా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లా డుతూ...విద్యుత్ కోతలు, సరఫరాలో అంత రాయాలతో పొలాలకు సాగునీరు అందక వానాకాలం వరి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వివరాలు 2లో

# 60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం

- మునగాలలో రూ. 9.60 కోట్లతో కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు
- అక్టోబర్ 6న శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 04(ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లాలోని 1029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించేందుకు మునగాల మండలంలో రూ. 9.60 కోట్లతో అత్యాధునిక కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు అక్టోబర్ 6న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మునగాల మండలంలో జాతీయ రహదారి పక్కన, మునగాల మాదారం మధ్య ఎంపిక చేసిన స్థలంలో ఈ కేంద్రీకృత వంటశాలను నిర్మించనున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి ఆహారం తయారు చేసి, ప్యాకింగ్, రవాణా, పంపిణీ చేసే విధంగా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు.

వివరాలు 2లో..

# కరెంటు కోతలపై రైతన్న కన్నెర్ర!

మొదటిపేజీ తరువాయి

రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను కాపాడుకోవాల్సిన కీలక సమయంలో విద్యుత్ సరఫరాలో కోతలు విధించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కనీసం 12 గంటలపాటు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సంబంధించిన పలు అంశాల్లో ఇబ్బందులు పెరిగాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు.విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే మోటార్లు పనిచేయక సాగునీరు అందక పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా ప్రస్తుత వానాకాలం పంటను కాపాడేందుకు తక్షణమే విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని కోరారు.రైతుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, రావులపల్లి క్రాస్‌రోడ్డు తండా సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ చింతకుంట్ల మనోజ్, గోపాల్ నాయక్,పూలాని నాయక్,హేమా నాయక్,బర్ల సోమన్న,తెడ్డు కృష్ణారావు,కళ్యాణ్, గునిగంటి యాదగిరి, పూర్ణ నాయక్,భాస్కర్, అవిలయ్య, సమ్మద్,యాకయ్య, బాషా, మహిళా రైతులు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# 60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం

మొదటిపేజీ తరువాయి

దేశంలోనే అత్యాధునిక సదుపాయాలతో ఈ వంటశాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.



### సింగరేణి విరాళంతో ప్రాజెక్టు

కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి సింగరేణి కంపెనీ రూ. 9.60 కోట్ల విరాళం అందించింది.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి ఈ నిధులను సమకూర్చినట్లు మంత్రి తెలిపారు.విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే ఈ కార్యక్రమానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,సింగరేణి కంపెనీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.

### 1029 విద్యాసంస్థలకు ఆహార సరఫరా

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు.జిల్లాలోని సుమారు 1029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం అల్పాహారం తయారు చేసి సరఫరా చేయడం కమ్యూనిటీ కిచెన్ ప్రధాన ఉద్దేశం.అవసరాన్ని బట్టి ఎంపిక చేసిన కొన్ని జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించే అంశాన్ని కూడా ప్రణాళికలో చేర్చారు.

### నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం

వంటశాలలో ఆహార తయారీ, ప్యాకింగ్, రవాణా, పంపిణీ కోసం సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఆహార నాణ్యత, పోషక విలువలు, పరిశుభ్రత, సురక్షిత నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విద్యార్థులకు పాఠశాల వేళల్లో పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, సంక్షేమానికి తోడ్పడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.

### పనులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణ

కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం, నిర్వహణ, ఆహార తయారీ, విద్యాసంస్థలకు సరఫరా వంటి అంశాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించనున్నారు.కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, సంబంధిత అధికారులు, అమలు భాగస్వాములతో సమన్వయం చేస్తూ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు.నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ వంటశాల ద్వారా సూర్యాపేట జిల్లాలోని వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందనుంది.

# సోమిరెడ్డికి సన్మానం

మొదటిపేజీ తరువాయి

మాజీ మంత్రివర్యులు సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును కలవడంతో వారు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, మాజీ మదర్ డైరీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి, ఆలేరు నియోజకవర్గ నాయకులు సిరిగిరి విద్యాసాగర్ , తదితరులు పాల్గొన్నారు

# రైతులకు 16 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించాలి

**ఆలేరు అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి)**



యాదాద్రి భువనగిరి జిల్లాలోని రైతులకు 16 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని వర్షాలు పడక పోవడంతో పంటలు ఎండు తున్నాయని ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబర్ 5 సోమవారం రోజున ఉదయం 10:30కు భువనగిరి పట్టణంలోని విద్యుత్ శాఖ ఎస్సీ ఈ కార్యాలయం ముందు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా కార్యవర్గ సభ్యులు మండల కార్య వర్గ సభ్యులు జిల్లా సమితి సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కనకయ్య, వార్డు సభ్యులు కందుల మధు, జానమ్మ ప్రవీణ్ రవి రాజు ఆంజనేయులు పరశురాములు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని పాఠశాలల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

**- బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్**

**మిర్యాలగూడ, అక్టోబర్ 04,(ప్రజాజ్యోతి):**




ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్ విద్యాశాఖ అధికారులను కోరారు.ఆదివారం స్థానికంగా మాట్లాడుతూ ఒక పాఠశాలకు మాత్రమే అనుమతి తీసుకొని నాలుగు ఐదు బ్రాంచీలను ఏర్పాటు చేసి గ్రామర్ ,టెక్నో,ఈ టెక్నో, ఒలంపియాడ్, వంటి పేర్లతో అనుమతులు లేకుండా పాఠశాలలను నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి పాఠశాలలు పుట్టగొడుగుల్లా విస్తరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహా నగరాల్లోనే కాక పట్టణాలు, పల్లెల్లో ఇలాంటి వ్యవహారాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై సమగ్ర తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై చట్ట పరమైన చర్యలు తీసుకుని విద్యార్థుల తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడాలని ఆయన స్పష్టం చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయం



**తుంగతుర్తి, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):**



అక్షర ఫౌండేషన్ సూర్యాపేట, శంకర కంటి హాస్పిటల్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో, సంకినేని కమలమ్మరామారావు జ్ఞాపకార్థం ఎస్.కె.ఆర్. కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ సౌజన్యంతో ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ సంకినేని రవీందర్ రావు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంకినేని రవీందర్ రావు మాట్లాడుతూ... మారుమూల ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అని పేర్కొంటూ, కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఐ క్యాంపులో మంచి సర్వీస్ అందిస్తున్న శ్రీలక్ష్మి పారామెడికల్ కాలేజ్ సూర్యాపేట విద్యార్థులను అభినందించారు.ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 160 మంది కంటి సమస్యలతో వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం 30 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించగా, వారిని తదుపరి చికిత్స మరియు ఆపరేషన్ల కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబా, అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, ఐ క్యాంప్ కోఆర్డినేటర్ శివ రంగ, అక్షర ఫౌండేషన్ ప్రతినిధులు గౌరిశెట్టి అప్పారావు, దేవరకొండ సాయికుమార్, కోదాడ స్టాలిన్, జటంగి ముత్తయ్య, శంకర కంటి హాస్పిటల్ వైద్య సిబ్బంది, లక్ష్మీ పారామెడికల్ నర్సింగ్ విద్యార్థులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులు ఓట్లు నమోదు చేసుకోవాలి

**తుంగతుర్తి, అక్టోబర్ 4,(ప్రజాజ్యోతి):**



పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, రాబోయే శాసనమండలి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్ అన్నారు. మండల పరిధిలోని సంగెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల చేర్పింపు కార్యక్రమంలో భాగంగా పట్టభద్రులకు ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రాములు గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడేళ్ల పాలనపై పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొందని అన్నారు. ప్రభుత్వ విధానాలపై తమ అభిప్రాయాన్ని ఎన్నికల ద్వారా వ్యక్తం చేసేందుకు అర్హులైన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఓటు నమోదు చేసుకునే విధానం, అవసరమైన వివరాలపై పట్టభద్రులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పట్టభద్రులు మల్యాల రాములు, వీరబోయిన లింగయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జటంగి రవి, మాతంగి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ 4వ తరగతి ఉద్యోగుల సమితి నూతన కార్యవర్గం ఎన్నిక

**తుంగతుర్తి, అక్టోబర్ 4,(ప్రజా జ్యోతి):**



మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్ 4వ తరగతి ఉద్యోగుల సమితి నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంటేపాక సోమేష్, జిల్లా అధ్యక్షుడునాగయ్య,శ్రీను, లింగయ్య, దశరథల సమక్షంలో ఆదివారం ఎన్నుకున్నారు. నూతన డివిజన్ అధ్యక్షుడిగా ఎస్.సోమనర్సయ్య అసోసి యేషన్ అధ్యక్షుడిగా ప్రమోద్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా రాములు, సంయుక్త కార్యదర్శిగా హరిత, కోశాధికారిగా జోవెల్ రాజు, కో ఆప్షన్ నెంబర్ యాకుబ్, ప్రచార కార్యదర్శిగా బుచ్చయ్య, ఈసీ మెంబర్లుగా మంజుల, యల్లయ్య, మల్లయ్యలను ఎన్నుకున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికి నూతన అధ్యక్షుడు సోమనర్సయ్య అన్నారు. అనంతరం వారికి ఆ సంఘం నాయకులు అభినందనలు తెలుపుతూ శాలువా, పూలదండలతో సన్మానించారు. ఉద్యోగుల సమస్యలు, హక్కులను పరిరక్షణను నూతన కమిటీ కట్టుబడి పనిచేయాలని కార్యవర్గ సభ్యుడు రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా నాయకులు పేర్కొన్నారు.

## బహుజన రాజ్యాధికార సమరభేరికి సన్నాహాలు కాన్షీరాం వర్ధంతి సందర్భంగా అక్టోబర్ 9న హైదరాబాద్‌లో సభ

**వలిగొండ అక్టోబర్ 04(ప్రజాజ్యోతి న్యూస్):**

బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం వర్ధంతి సందర్భంగా అక్టోబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'బహుజన రాజ్యాధికార సమరభేరి' సభకు సంబంధించిన గోడపత్రికను వలిగొండ మండలంలో బీఎస్పీ భువనగిరి అసెంబ్లీ అధ్యక్షుడు సుక్క శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధమల్ల లింగస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు.అసెంబ్లీ అధ్యక్షుడు సుక్క శ్రీకాంత్ మాట్లాడుతూ వలిగొండ మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేసి, బహుజన సమాజంలో రాజకీయ చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మస్కు నరసింహ, వీర్లపల్లి పరశురాములు, అరూర్ సెక్టార్ అధ్యక్షులు ముప్పిడి నవీన్, గోపరాజుపల్లి సెక్టార్ అధ్యక్షులు సలిగంజి నవీన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సూర్యాపేట నియోజకవర్గ రచయితల సంఘం ఆవిర్భావం



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 04(ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2 లో ప్రముఖ కవి, రచయిత, మనం వికాస్ వేదిక అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ అధ్యక్షతన జరిగిన రచయితల కవుల సమావేశంలో సూర్యాపేట నియోజకవర్గ రచయితల సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు గణేష్ పేర్కొన్నారు.జిల్లాలో సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్న సాహితివేత్తలను, రచయితలను, కవులను కళాకారులను ఏకతాటిపై నడిపించడానికి రచయితల సంఘం కృషి చేస్తుందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న రచయితలు, కవులు సమాజాన్ని మేల్కొలిపే విధంగా రచనలు చేసేలా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.రచనలు వెలుగులోకి తెచ్చి సమాజం చైతన్యానికి రచయితల సంఘం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.సూర్యాపేట నియోజకవర్గ రచయితల సంఘం అధ్యక్షులుగా శీలా అవిలేను,ప్రధాన కార్యదర్శిగా గొడితాల వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులుగా పబ్బతి వెంకటేశ్వర్లు,పోతుగంటి వీరాచారి,కార్యదర్శులుగా మెంతబోయిన సైదులు,ఏబెల్ శశి,మహిళా కార్యదర్శి గా ఎన్.సి.రోజా,కార్యవర్గ సభ్యులుగా గడ్డం కృష్ణా,ఆలకుంట్ల లింగయ్య,కందుకూరి యాదగిరి,లింగాల శ్రీనివాస్,విజయ్ కుమార్, మంజు భార్గవి,షేక్ అలీమొద్దీన్,కుసుమ సిద్ధారెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు.గౌరవాధ్యక్షులుగా సీనియర్ రచయిత బెల్లంకొండ శ్రీరాములును ఎన్నుకున్నట్లు తెలిపారు.

## కోహెన్స్ లైఫ్ సెన్సెస్ సేవలు అభినందనీయం



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 04(ప్రజా జ్యోతి):**

కోహెన్స్ లైఫ్ సెన్సెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్ లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్ డీఎంహెచ్ఓ డాక్టర్ పెండెం వెంకటరమణతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేని ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు.పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు కోహెన్స్ లైఫ్ సెన్సెస్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.ఈ వైద్య శిబిరంలో బీపీ,షుగర్,గుండె సంబంధిత పరీక్షలు, మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు, ఇతర ఆరోగ్య సమస్యలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులను అందించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ధారవత్ విజయ నాయక్, లింగ నాయక్,శ్రీహాన్ హాస్పిటల్ డాక్టర్ గిరిధర్ రెడ్డి, విజిత రెడ్డి, అర్థో వెంకటేష్,కోహెన్స్ లైఫ్ సెన్సెస్ యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవకు గౌరవ డాక్టరేట్

### - డా.పిల్లుట్ల రఘుకు ఘన సన్మానం

### - ప్రజల కోసం నిరంతర సేవే లక్ష్యం.. గౌరవ డాక్టరేట్‌తో మరింత బాధ్యత

**గరిడేపల్లి,అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):**

ప్రజా సంక్షేమం,సామాజిక సేవా కార్యక్రమాల్లో నిరంతరం తన వంతు సేవలందిస్తున్న హుజూర్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు డా.పిల్లుట్ల రఘుకు అరుదైన గౌరవం దక్కింది.ఆయ న సేవలను గుర్తిస్తూ ఇటీవల గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయ డంతో గరిడేపల్లి మండల బీఆర్ ఎస్ నాయకులు ఘనంగా సన్మా నించారు.మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రఘుకు శాలువా కప్పి,పూలమా లలు వేసి అభినందనలు తెలిపా రు.ప్రజల సమస్యలపై స్పందిస్తూ ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగ స్వామ్యమవుతూ రఘు అంది స్తున్న సేవలకు గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ప్రజలతో మమేకమై వారి శ్రేయస్సు కోసం పనిచేసే వ్యక్తిగా రఘుకు ఈ గుర్తింపు దక్కడం గరిడేపల్లి, హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు గర్వకారణమని వారు పేర్కొన్నారు.భవిష్యత్తులో కూ డా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు.సన్మా నానికి స్పందించిన డా.పిల్లుట్ల రఘు మాట్లాడుతూ తనపై అభిమానంతో ఘనంగా సన్మా నించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,శ్రేయోభిలాషులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు లభించిన గౌరవం మరిం త బాధ్యతను పెంచిందన్నారు. పదవులు,గౌరవాల కంటే ప్రజల అభిమానం తనకు ఎంతో విలువైనదని,ప్రజల కోసం పనిచేయడమే తన లక్ష్యమని తెలిపారు.తన శ్వాస ఉన్నంత వరకు ప్రజల కోసమే పనిచేస్తా నని,ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల్లో తన వంతు కృషి కొనసాగిస్తానని రఘు స్పష్టం చేశారు.తనపై నమ్మకం ఉంచి అభిమానంతో అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని



తెలిపారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ గడేపల్లి మండల పార్టీ మాజీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్, సింగిల్ విండో మాజీ చైర్మన్ వీరం రెడ్డి శంబిరెడ్డి, గుత్తికొండ వెంకటరమణారెడ్డి, మన్నెం వేణు యాదవ్, సర్పంచులు మాలోతు సుధాకర్, వాంకుడోత్ రవి నాయక్, మచ్చ ముత్తమ్మ మురళి, మాజీ సర్పంచులు నల్లపాటి వీరమ్మ భాస్కర్ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ పంటలను ప్రభుత్వం కాపాడాలి ...!

## కరువు పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

### - మాజీ ఎమ్మెల్యే జూలకంటి డిమాండ్

**దామరచర్ల ,అక్టోబర్ 04,(ప్రజాజ్యోతి):**



ఖరీఫ్ సీజన్లోరాష్ట్రంలో వేల ఎకరాలలో వరి, పత్తి తదితర వాణిజ్య పంటలను రైతులు వేశారని వేసిన పంటలకు నీరంధక ఎండి పోతున్నాయని వాటిని రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. ఆదివారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో ఎండిపోతున్న వరి పంటలను చూసి చలించిపోయారు. రైతులు ఎండిన తమ పొలాలలో పశువులను మేపటం రైతు ప్రతినిధి బృందం తో వెళ్లిన ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావ ప్రభావం వల్ల రాష్ట్రంలో కోన్ని ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం అఖిలపక్షం తో సమావేశంఏర్పాటు చేసి సలహాలు సూచనలుతీసు కోవాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోనిపరిస్థితులను కేంద్రానికి తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రతినిధులతో మాట్లాడి సమస్యను పరిష్క రించేందుకు వారి సూచనలుతీసుకోవాలని తెలిపారు. రైతులు ఎకరాకు 20 నుండి 30 వేల రూపాయలు వెచ్చించి పంటలను సాగు చేశారని అందుకు ప్రైవేట్ వ్యాపారస్తుల నుండి అదనపు వడ్డీ చెల్లించి డబ్బులు తెచ్చి సాగు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పొలాల ను,చేలను అధికారుల బృందాన్ని పంపి పంట నష్టం అంచనా వేయాలని తగిన నష్టపరిహారం అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. దామరచర్ల మరికొన్ని ప్రాంతాలలో ఎక్కువ హరిజన,గిరిజన రైతులే పంటలు వేశారని వారికి ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన కోరారు. అందుకు ప్రత్యామ్నాయంగా నాగార్జునసాగర్ ఎడమకాల ద్వారా సాగునీటిని విడుదల చేయాలని తద్వారా కొంత మేరకు రైతులకు ఉపశమనం కలుగుతుందని ఆయన సూచించారు. అదేవిధంగా ఆయకట్టు ప్రాంతంలో ఉన్న చెరువులు కూడా సాగర్ నీటితో నింపితే అటు తాగునీటి ఇటు సాగునీటి సమస్య కూడా పరిష్కారమవుతుందని దాంతోపాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని ఆయన సూచించారు. రైతులను కాపాడేం దుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. వారి వెంట సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్,రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరేపల్లి వెంకటేశ్వర్లు,సిపిఎం నాయకులు వినోద్ నాయక్,దయానంద్ కోటిరెడ్డి,ఎర్రనాయక్,రైతులు ఉన్నారు.




# పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 04(ప్రజా జ్యోతి):**




కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సూర్యాపేట సర్కిల్ పరిధిలోని జమ్మిగడ్డ సబ్ స్టేషన్ ప్రాంగణంలో అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విద్యుత్ వినియోగదారులు హాజరై పథకానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు పథకం కోసం నమోదు చేసుకున్నారు. ఎస్ఈ పి.యాదగిరి మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట సర్కిల్ ఎస్ఈ పి.యాదగిరి, డీఈ టెక్నికల్ ఎన్.వెంకటకృష్ణయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అకౌంట్స్ సిబ్బంది, ఆపరేషన్ ఏడీలు, ఏఈలు, రెడ్కో శాఖ, బ్యాంక్ సిబ్బంది,వివిధ యూనియన్ నాయకులు, విద్యుత్ వినియోగ దారుల సేవా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రేపు జరగనున్న విద్యుత్ సమస్యపై సిద్ధం కండి మండల పార్టీ అధ్యక్షుడు ఏరుకొండ నరసింహ

**పెద్దవూర అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి)**

పెద్దవూర మండలంలోని ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను భారతీయ జనతా పార్టీ మండల పార్టీ అధ్యక్షుని ఆధ్వర్యంలో సోమవారం ముట్టడించనున్నారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల నాయకులు ఏరుకొండ నరసింహ ఆరోపించారు,వ్యవసాయానికి ఎన్ని గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారో స్పష్టత లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు దెబ్బతిని రైతులకు నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు,రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దవూర మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు,రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.



# ఇందిరమ్మ ఇల్లు మంజూరు వేముల వీరేశం ఆదేశాలు

**నార్కట్ పల్లి, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి):**

ఆదివారం నార్కట్ పల్లి పట్టణంలోని డాక్టర్ కాలనీ లో వాటర్ ట్యాంక్ కూలిపోవడంతో ప్రమాదవశాత్తు ధ్వంసమైన బాధితురాలు సాతిరి లక్ష్మి ఇంటిని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ ఆమె ఇంటిని పరిశీలించి ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశంతో సంప్రదించి బాధితురాలు సాతిరి లక్ష్మికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం తో మాట్లాడారు.



# నల్గొండ నుంచే జనసేన ఎన్నికల జైత్రయాత్ర

## – పవన్ రాకతో రాజకీయ ప్రకంపనలు

## – ప్రజా సమస్యలపై జనసేన సమరభేరి

## – పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు

**చౌటుప్పల్, అక్టోబర్ 4 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ గడ్డపై ఉద్యమాల పురిటిగడ్డ అయిన నల్గొండ నుంచే జనసేన ఎన్నికల జైత్రయాత్రకు శ్రీకారం చుడుతామని ఆ పార్టీ నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు తెలిపారు. చౌటుప్పల్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా జనసేన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త శకానికి నాంది పలుకుతున్నామని, ఆయన రాకతో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉత్సాహపరుస్తూ రాబోయే రాజకీయ పరిణామాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దశాబ్ద కాలం పాటు పాలించిన బీఆర్ఎస్ ప్రజల ఆశలను వమ్ము చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని శ్రీనివాసరావు మండిపడ్డారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నా పట్టించుకోకుండా మోసం చేస్తున్నారని ఘాటుగా ప్రశ్నించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. తెలంగాణలో సామాజిక న్యాయం కేవలం జనసేనతోనే సాధ్యమని, ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ప్రారంభమవుతున్న ఈ ఎమ్మెల్సీ ఎన్నికల పోరాటం పార్టీకి 'సెమీఫైనల్స్' లాంటిదని అభివర్ణించారు.





పవన్ కల్యాణ్ రాకతో రాజకీయ ప్రళయం వస్తుందని హెచ్చరిస్తూ, పట్టభద్రులందరూ జనసేనకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకుడు ఆముదాల పరమేశ్ ఎన్నికల ప్రచార నిమిత్తం రూ. లక్ష చెక్కును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన తెలంగాణ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ మమ్ము రెడ్డి ప్రేమ్ కుమార్, రాష్ట్ర నాయకులు మచ్చ సుధాకర్, శర్మ, శిరీష, ప్రజిత్ గౌడ్, మిర్యాల రామక్రిష్ణ, శివ కార్తీక్, లక్ష్మణ్ గౌడ్, పీక ప్రవీణ్, మామిడాల రమేశ్, శ్రీకాంత్, లింగస్వామి, బద్రి రాజు, పాండు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలి..

**నూతనకల్, అక్టోబర్ 04 (ప్రజా జ్యోతి):**

అర్హులైన నిరుపేదలకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలని చిల్పకుంట్ల బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పులుసు లింగమల్లయ్య అధికారులను కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసే క్రమంలో డ్రా పద్ధతిన పంపిణీ చేయాలని ఉద్దేశంతో డ్రా తీయడం జరిగిందని,కొన్ని అనివార్యకారణాల వలన ఆ ఇండ్ల పంపిణీ ఆగిపోయిందని, మరల ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పంపిణీ జరుగనున్నట్లు సమాచారం వచ్చిందని ఆ పంపిణీ అధికారుల ఆధ్వర్యంలో నిరుపేదలైన అర్హులకే చెందే విధంగా తగిన చర్యలు తీసుకుని డ్రా పద్ధతిన ఇండ్ల పంపిణీ చేయాలని,అర్హులైన నిరుపేదలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను వారు కోరారు. ఈ డ్రా పద్ధతిని గ్రామపంచాయతీ ఆవరణంలో బహిర్గతంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బిక్కి బుచ్చయ్య గౌడ్,బత్తుల విద్యాసాగర్ బత్తుల విజయ్ కుమార్ బత్తుల గురువయ్య బత్తుల వెంకన్న గాంధీ మధుకర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# వాటర్ ట్యాంక్ కూలి ఇల్లు ధ్వంసం..

## బాధితురాలికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేముల వీరేశం ఆదేశాలు

**నార్కట్‌పల్లి, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):**

నార్కట్‌పల్లి పట్టణంలోని డాక్టర్ కాలనీలో ఆదివారం వాటర్ ట్యాంక్ కూలిపోవడంతో ప్రమాదవశాత్తు ధ్వంసమైన బాధితురాలు సాతిరి లక్ష్మి ఇంటిని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ పరిశీలించారు. బాధితురాలి పరిస్థితిని తెలుసుకున్న ఆయన, ఈ విషయాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదంలో ఇల్లు ధ్వంసం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సాతిరి లక్ష్మికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. బాధితురాలికి ప్రభుత్వ పరంగా సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.







# పులిచింతల దారి... నరకప్రాయం

## - అధ్వానంగా రహదారి - పర్యాటకానికి గుంతల గ్రహణం.. నిత్యం ప్రమాదాలు - 6న మంత్రుల రాకతోనైనా మోక్షం దక్కేనా..?

**చింతలపాలెం, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి) :**

అడుగుకో గుంత.. ఆపై అధ్వానంగా మారిన ఆ దారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి. చింతలపాలెం మండలంలో పులిచింతల ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారి స్థానికుల పాలిట శాపంగా మారింది. దశాబ్ద కాలంగా వేధిస్తున్న ఈ రహదారి సమస్యకు.. ఈ నెల 6న మంత్రుల పర్యటనతోనైనా శాశ్వత పరిష్కారం దొరుకుతుందేమోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మండలంలోని అంజనీ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి పులిచింతల కాలనీ, వజినేపల్లి, బుగ్గమాదారం మీదుగా జగ్గయ్యపేట రోడ్డును కలిపే సుమారు 10 కిలోమీటర్ల రహదారి పూర్తిగా గుంతల మయమైంది. 2016లో పులిచింతల కాలనీ నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడినప్పటికీ రోడ్డు పరిస్థితిలో ఏమాత్రం పురోగతి లేదు. తారు లేచిపోయి, కంకర తేలి భారీ గుంతలు ఏర్పడటంతో ఏది రోడ్డో, ఏది గుంతో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడిపోతూ తీవ్ర గాయాలపాలవుతున్నారు. ఇంతటి దుస్థితిలో ఉన్నా రహదారి మరమ్మతులపై అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం.రహదారి సక్రమంగా లేకపోవడంతో పులిచింతల కాలనీ, వజినేపల్లి గ్రామాలకు కనీస ఆర్టీసీ బస్సు సౌకర్యం కరువైంది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ చిన్న అత్యవసర పని వచ్చినా ప్రైవేటు వాహనాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రవాణా సదుపాయం లేకపోవడంతో ఈ గ్రామాల ప్రజల దైనందిన జీవితం కష్టతరంగా మారింది. ప్రకృతి రమణీయతతో అలరారే పులిచింతల ప్రాజెక్టును సందర్శించేందుకు ఆదివారాలు, సెలవు దినాల్లో పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. అయితే, ఈ 10 కిలోమీటర్ల నరకయాతన చూసి వారు బెంబేలెత్తిపోతున్నారు. పులిచింతలను గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామనే ఆలోచనలు.. కనీస రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా మారుతున్నాయి. ఈ నెల 6వ తేదీన రాష్ట్ర మంత్రులు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లు పులిచింతల ప్రాజెక్టు వద్దకు రానున్నారు. ఈ నేపథ్యంలో ఏళ్లుగా పడుతున్న రోడ్డు కష్టాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లేందుకు స్థానికులు సిద్ధమవుతున్నారు. ఈ పర్యటనతోనైనా తమ కష్టాలు తీరుతాయేమోనని.. అధికారులు స్పందించి రోడ్డు పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# గ్రాడ్యుయేట్స్ ఓటు నమోదు ప్రక్రియ లో భాగస్వాములు కావాలి..!

## కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జుల సమావేశం లో డిసిసి బాలకృష్ణ

**మిర్యాలగూడ,అక్టోబర్ 04,(ప్రజాజ్యోతి) :**

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మిర్యాలగూడ పట్టణంలోని పట్టభద్రుల ఓటు నమోదుప్రక్రియను విజయవంతం చేయడమే లక్ష్యంగా అందరూ భాగస్వాములు కావాలని డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ కోరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జులతో సమావేశంనిర్వహించారు.బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో అర్హత కలిగిన పట్టభద్రులను గుర్తించి ఓటు నమోదు ప్రక్రియ సక్రమంగా జరిగేలా కృషి చేయాలన్నారు.ప్రతి కౌన్సిలర్, వార్డు ఇంచార్జి తమ పరిధి లోని పట్టభద్రులను గుర్తించి, ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదయ్యేలా సమన్వయంతో పనిచేయాలని బాలకృష్ణ సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జులు, పట్టణ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# దళిత మహిళ మాధవిపై దాడి అమానుషం

## - న్యాయం జరిగే వరకు పోరాటం; దళిత సంఘాలు - పరారీలో ఉన్న నిందితుడుని తక్షణమే అరెస్ట్ చేయాలి





**చింతపల్లి అక్టోబర్ 04(ప్రజాజ్యోతి)**

ఒక దళిత మహిళపై జరిగిన భౌతిక దాడి అత్యంత అమానుషమని, బాధితురాలికి తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చింతపల్లి చౌరస్తాలో పలు దళిత సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు బృందంగా ఏర్పడి భారీ ధర్నా, రస్తారోకో నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చింతపల్లి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నల్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా చింతపల్లి ప్రధాన చౌరస్తాలో రహదారిపై బైఠాయించి నిందితులకు వ్యతిరేకంగా, పోలీసుల తీరుకు నిరసనగా పెద్దెత్తున నినాదాలు చేశారు. చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామానికి చెందిన గనిపల్లి మాధవిపై జరిగిన భౌతిక దాడి అమానుషం అన్నారు. ధర్నా, రాస్తారోకో కారణంగా హైదరాబాద్–నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై తీవ్రస్థాయిలో ట్రాఫిక్ గంటపాటు స్తంభించిపోయింది. మహిళపై దాడికి పాల్పడిన నిందితుడు మాజీ సర్పంచి భర్త కొప్పోలు అమర్నాథ్ ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దాడికి గురైన దళిత మహిళకు తగిన వైద్య సహాయం అందించడంతో పాటు కుటుంబానికి ప్రభుత్వ పరంగా తక్షణ ఆర్థిక సహాయం, రక్షణ కల్పించాలన్నారు. ఈ ఘటనపై బాధ్యతాయుతమైన ఉన్నతాధికారులతో విచారణ జరిపించి చవేగంగా న్యాయం జరిగేలా చూడాలన్నారు. సమాజంలో దళితులపై, మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదని సంఘాల నాయకులు హెచ్చరించారు. అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, నిందితునిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, పరారీలో ఉన్న నిందితున్ని పోలీసు బృందం వెతుకుతుందని చెప్పడంతో దళిత సంఘాల నాయకులు ధర్నాను విరమించారు. పలు దళిత, బహుజన సంఘాల ముఖ్య నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, బాధితురాలి కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండల అధ్యక్షుడు నల్ల ఆంజనేయులు మాదిగ, జిల్లా ఇన్చార్జ్ కోళ్ల శివ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బక్రం శీను మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పోతేం సహదేవుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మాదిగ సందె ఏసు మాదిగ, జిల్లా కార్యదర్శి కుర్మేటి వెంకటరమణ, మండల ఉపాధ్యక్షుడు లాలయ్య, ఎర్ర రాకేష్, జాతీయ నాయకుడు కంబాలపల్లి వెంకటయ్య మాదిగ, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బావుండ్ల పల్లి చెన్నయ్య, సీనియర్ నాయకులు వింజమూరు కృష్ణ మాదిగ, మహిళా సంఘాల ప్రతినిధులు, బాధితురాలి కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులిగిల్ల బాలయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ చామల..

**భువనగిరి,రూరల్ అక్టోబర్ 4(ప్రజాజ్యోతి)**



టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ తెలంగాణ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులిగిల్ల బాలయ్య తండ్రి పులిగిల్ల యాదగిరి ఇటీవల మృతి చెందారు. విషయం,తెలుసుకున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్కుమార్రెడ్డి భువనగిరి మండలం ముత్తిరెడ్డి గూడెం గ్రామానికి వెళ్లి పులిగిల్ల బాలయ్య కుటుంబాన్ని పరామర్శించారు. యాదగిరి మృతికి సంతాపం వ్యక్తం చేసిన ఎంపీ.. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఎంపీ వెంట భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ పిసిసి డెలిగేట్ మెంబర్ తంగళ్ళపల్లి రవికుమార్ కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ పడిగల ప్రదీప్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అతహర్ గారు ముత్తిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ రాంపల్లి కృష్ణ మరియు ఉప సర్పంచ్ అందే మల్లేష్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మెరుగు స్వామి మరియు గంగసానిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు బోయిని నాగేష్ మరియు ముత్తిరెడ్డిగూడెం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండ అబ్బయ్య రాగుల రవీందర్ యూత్ కాంగ్రెస్ నాయకులు వివిధ కుల సంఘాల నాయకులు మహిళలు పాల్గొన్నారు...

## ఆర్.టి.ఐ కమిషనర్ అయోధ్య రెడ్డిని కలిసిన పాత్రికేయులు

**ఆలేరు అక్టోబర్ 4(ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రానికి చెందిన పాత్రికేయులు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దడిగ రమేష్, ప్రధాన కార్యదర్శి సిరిగిరి స్వామి ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ పిఆర్ఓ ఆర్టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా ఎల్లమ్మ టెంపుల్ దేవాలయానికి సమీపంలో ఉన్న ఎస్వీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన విలేకరుల విందు భోజన కార్యక్రమానికి హాజరై మర్యాదపూర్వకంగా కలిసి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



# నారాయణపురం అభివృద్ధికి మరో ముందడుగు

## ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి సహకారంతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శ్రీకారం

**నడిగూడెం, అక్టోబర్ 04, ప్రజా జ్యోతి:**

నారాయణపురం గ్రామంలోని పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటరెడ్డి శ్రీకారం చుట్టారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి సహకారంతో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అంగన్‌వాడీకి సొంత భవనం నిర్మాణం పూర్తయితే గ్రామంలోని చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలను ఒకే చోట సౌకర్యవంతంగా అందించేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం సొంత భవనంలోకి మారడంతో చిన్నారులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు కార్యకర్తలు, సిబ్బంది సేవలు అందించేందుకు కూడా అనుకూలంగా ఉంటుందని అన్నారు. గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం, ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామని నాగిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ



అభివృద్ధికి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, నిర్ణీత సమయంలోగా పూర్తి చేసి చిన్నారులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. భవనం పూర్తయిన అనంతరం గ్రామంలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మరింత మెరుగైన సేవలు అందే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి, సంబంధిత అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**రామన్నపేట, అక్టోబర్ 4: ప్రజా జ్యోతి,**

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం జడ్పీహెచ్ఎస్ మునిపంపులబ పాఠశాల 2006-07 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 20 వసంతాల స్నేహ పరిమళం పేరుతో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. 2006-07 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సుమారు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు నరసింహ, వెంకటేష్, రవందర్, సునీత, కవిత మాథ్స్, కవిత, హరిచంద్ర, సత్య, వెంట, రాఘవేందర్, శంభు తదితరులు పాల్గొన్నారు.




# ఎలక్ట్రిషన్ కుటుంబానికి ఆర్థిక సాయం

### - అనారోగ్యంతో మృతి చెందిన రవి కుటుంబానికి కే వేల చేయూత

**నాగారం అక్టోబర్ 04 ప్రజా జ్యోతి.**

నాగారం మండలంలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన ఎలక్ట్రిషన్ గద్దగుట్టి రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జానీ పాషా ఆధ్వర్యంలో రవి కుటుంబాన్ని పరామర్శించారు. తొలుత రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రవి కుటుంబానికి రూ.5 వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు. తోటి ఎలక్ట్రిషన్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని జానీ పాషా తెలిపారు. కార్యక్రమంలో కొడారి అవిలయ్య, సంగిశెట్టి మదర్, సట్టు వెంకన్న, జి.రమేష్, రాంబాబు, గణేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# నీట్‌లో ర్యాంకు సాధించిన స్పందనకు అభినందనలు

- ఎంబీబీఎస్ సీటు సాధించిన పసునూరు విద్యార్థిని
- విద్యుత్ శాఖ అధికారుల అభినందనలు
- స్పందనను అభినందించిన ఎస్ఈ యాదగిరి
- విద్యార్థుల విజయాలు స్ఫూర్తిదాయకం
- కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు సాధించవచ్చు

**నాగారం, అక్టోబర్ 04 ప్రజా జ్యోతి:**

నాగారం మండలం పసునూరు గ్రామానికి చెందిన దీగోజు విజయ్ కుమార్ లక్ష్మి దంపతుల కుమార్తె దీగోజు స్పందన నీట్‌లో ప్రతిభ కనబరిచి ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటు పొందిన సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ యాదగిరి, సూర్యాపేట డీఈ వెంకట కృష్ణయ్య స్పందనను అభినందించారు. అనంతరం నాగారం ఏఈడీ శ్రీనివాసరావు, తుంగతుర్తి ఏఈడీ నరసింహ, ఏఈలు ఎం. మహేంద్ర కుమార్, రమేష్, సిబ్బంది సుల్తాన్, వెంకటేశ్వర్లు, పొదిల లక్ష్మణ్, నవీన్ తదితరులు పాల్గొని స్పందనకు శుభాకాంక్షలు తెలిపారు.



# యాదవ రాజ్యాధికార సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొమ్ము నరేష్ యాదవ్

### - యాదవుల హక్కుల కోసం ఉద్యమాన్ని బలోపేతం చేస్తా నరేష్ యాదవ్

**నాగారం అక్టోబర్ 04 ప్రజా జ్యోతి.**

తెలంగాణ యాదవరాజ్యాధికార సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొమ్ము నరేష్ యాదవ్ నియమితు లయ్యారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బడుగుల నాగార్జున యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ యాదవ్ మాట్లాడుతూ యాదవుల హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం మరింత బలంగా పనిచేస్తానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యాదవ సమాజాన్ని ఐక్యం చేస్తూ యువతను రాజకీయంగా చైతన్యపరుస్తానని తెలిపారు. రాజ్యాధికారంలో యాదవులకు సముచిత వాటా దక్కేలా నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.



# దేవరకొండ కుర్రాడికి గోవాలో గోల్డ్ ధమాకా

## - ఆల్ ఇండియా మల్టీ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో రామావత్ దీక్షిత్ ప్రతిభ

## - దీక్షిత్ ను సన్మానించి అభినందించిన ఎమ్మెల్యే బాలునాయక్

**దేవరకొండ, అక్టోబరు 04, (ప్రజా జ్యోతి) :**



మారుమూల తండా నుంచి బయలుదేరిన ఓ కుర్రాడు.. పట్టుదల, క్రమశిక్షణ, క్రీడపై అంకితభావంతో జాతీయ స్థాయి వేదికపై సత్తా చాటాడు. దేవరకొండ ప్రాంతానికి చెందిన గిరిజన యువ క్రీడాకారుడు రామావత్ దీక్షిత్ గోవాలో జరిగిన ఆల్ ఇండియా మల్టీ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ -2026లో అండర్17 వాలీబాల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించి దేవరకొండ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచాడు.మండల పరిధిలోని మగాలోనిబావి గ్రామ పంచాయతీ పరిధిలోని రేగళ్ల తండాకు చెందిన దీక్షిత్, ఈ పోటీల్లో రంగారెడ్డి జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించాడు. గత నెల 28, 29, 30 తేదీల్లో గోవాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన జట్లతో పోటీ పడిన రంగారెడ్డి జిల్లా జట్టు విజేతగా నిలిచింది.జట్టు విజయానికి దీక్షిత్ తన అత్యుత్తమ ఆటతీరుతో కీలకంగా నిలిచాడు. పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి జట్టు విజయంలో తన వంతు పాత్ర పోషించడంతో రంగారెడ్డి జిల్లా జట్టు మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. దీంతో దీక్షిత్ ఖాతాలో ప్రతిష్ఠాత్మకమైన స్వర్ణ పతకం చేరింది. తండాలో పండుగ వాతావరణంతమ ప్రాంతానికి చెందిన యువకుడు జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించడంతో రేగళ్ల తండా, మగాలోనిబావి గ్రామ పంచాయతీతో పాటు దేవరకొండ పరిసర ప్రాంతాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. దీక్షిత్ ఇంటి వద్ద అభినందనలు వెల్లువెత్తాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, క్రీడాభిమానులు దీక్షిత్‌ను, అతని కుటుంబ సభ్యులను అభినందించారు. గ్రామీణ ప్రతిభకు జాతీయ గుర్తింపుసరైన ప్రోత్సాహం, నిరంతర సాధన ఉంటే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా జాతీయ స్థాయి క్రీడాకారులు వెలుగులోకి వస్తారనే విషయాన్ని దీక్షిత్ విజయం మరోసారి చాటిచెప్పింది. మారుమూల తండా నుంచి జాతీయ స్థాయి వేదికపై స్వర్ణ పతకం సాధించడం యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే బాలు నాయక్ తో పాటు పలువురు పేర్కొన్నారు.దీక్షిత్ ఇదే స్ఫూర్తితో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, భవిష్యత్తులో అంతర్జాతీయ క్రీడా వేదికలపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి దేశానికి పేరు తీసుకురావాలని స్థానికులు ఆకాంక్షించారు.

# వేమవరం ప్రసన్నరత్నాకర్ బాబుకు ఘన నివాళులు.

## నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య.

**రామన్నపేట అక్టోబర్ 4(ప్రజా జ్యోతి)**

రామన్నపేట: ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కీ.శే. వేమవరం ప్రసన్నరత్నాకర్ బాబు దంపతుల 23వ వర్ధంతి సందర్భంగా జనంపల్లి గ్రామంలో ఆదివారం వారి విగ్రహాలకు పూలమాలలు వేసి పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ చిన్న వయసులోనే జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి జిల్లా అభివృద్ధికి వేమవరం ప్రసన్నరత్నాకర్ బాబు చేసిన సేవలను కొనియాడారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేస్తూ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు సేవలందించిన సమయంలో ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం దురదృష్టకరమన్నారు.వారు జీవించి ఉంటే ప్రజాప్రతినిధులుగా రాజకీయాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి పలు పదవులు చేపట్టేవారని లింగయ్య పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు జనంపల్లి గ్రామ అభివృద్ధికి కూడా ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. అప్పట్లో జిల్లా పరిషత్ చైర్మన్ పదవి చేపట్టడం ఎంతో కష్టతరమైనప్పటికీ, జిల్లా నాయకుల అందరి మన్ననలు పొందుతూ చిరునవ్వుతో బాధ్యతలు నిర్వర్తించేవారని అన్నారు. జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేసన నాయకులని,వేమవరం ప్రసన్నరత్నాకర్ బాబు లేని లోటును వారి మరణానంతరం జిల్లా పరిషత్ సభ్యులుగా వేమవరపు మనోహర పంతులు, మండల ప్రాదేశిక సభ్యులుగా



సుధీర్‌బాబు ప్రజాసేవ ఎంతో చేశారని, ఇలాంటి నాయకులు మనకు ఎంతో అవసరం అని ప్రజలు ఆదరణ చూపాలని, భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించి ప్రజల ఆశీస్సులు పొందాలని చిరుమర్తి లింగయ్య కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు కంభంపాటి శ్రీనివాస్ గౌడ్, గర్దాస్ విక్రమ్, మాజీ మండల అధ్యక్షులు, పోచబోయిన మల్లేశం, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి, పిట్ట కృష్ణారెడ్డి, అంబటి రవీందర్ రెడ్డి,పులిపలుల వీరస్వామి,ఈడం రాధా శ్రీనివాస్, బొక్క మాధవరెడ్డి,బందెల రాములు, కన్నెబోయిన బలరాం, ఎడ్ల నరేందర్ రెడ్డి, ఎడ్ల కృష్ణారెడ్డి,మిరియాల మల్లేశం, పిట్ట కృష్ణారెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, భూసాని రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఆ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 4 (ప్రజాజ్యోతి):**

పట్టణ కేంద్రంలోని నలంద విద్యాలయం 2005-06 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వనం వెంకటేశం, ఉపాధ్యాయులు టి.ఎన్. మూర్తి, జి. సత్యం, ఉమాశంకర్, దోర్నాల శ్రీనివాస్, సోమవరపు లక్ష్మీనారాయణ, దోర్నాల వెంకటేశం, సుమతి, లత, ఉమారాణి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థిని, చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ బైరూ పావని, ఆర్గనైజర్లు డి. శశాంక్, వై. శివశంకర్, ఎస్. రామేశ్వర్, బి. ప్రవీణ్, గంజి అమరేందర్, బి. సురేష్, గుర్రం రాధా, ప్రత్యూష, రజిత, కళ్యాణి, అర్చన, స్వప్న, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ కార్యాలయం ఎదుట రీలే నిరాహార దీక్షలు జయప్రదం చేయండి: వేముల హరికృష్ణ

**వలిగొండ అక్టోబర్ 04 (ప్రజాజ్యోతి న్యూస్):**

తెలంగాణ నిరుద్యోగ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న రీలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు వేముల హరికృష్ణ పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జిల్లాలోని నిరుద్యోగ ఉద్యమ కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా వేముల హరికృష్ణ మాట్లాడుతూ కళాకారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే రీలే నిరాహార దీక్షల్లో జిల్లాలోని నిరుద్యోగ ఉద్యమ కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గత ప్రభుత్వం కళాకారులను విస్మరించిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా కళాకారుల సమస్యలపై సరైన నిర్ణయం తీసుకోవడం లేదని విమర్శించారు. కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ప్రకటించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కళాకారుల పట్ల ప్రభుత్వం దురుసుగా వ్యవహరిస్తే తమ రచయితల పెన్నులు గన్నులవుతాయని, కళాకారుల గళాలు తూటాలై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కోట భిక్షపతి, ప్రధాన కార్యదర్శి గంధమల్ల శివశంకర్, జిల్లా నాయకులు తిరుమలేష్, మల్లం వెంకటేష్, పెంటేష్, నకిరెకంటి రవి, గంధమల్ల గణేష్, మహేష్, జాన్‌రెడ్డి, జ్యోతి, బాలమణి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

